# మాకూ ప్రేమలున్నాయి

ఏదో పెద్దశబ్దబయ్యేసరికి గబుక్కున నాకు మెలుకువ వచ్చింది. కళ్ళు తెరిచి చూశాను. అంతా చీకటిగా వుంది. పెద్ద రొద. ఎక్కడికో పడద్రోసుకుపోతున్నట్లుంది. ఏదో అరుపులాంటిది వినిపించింది. మొదట్లో ఎవరో ఏడుస్తున్నారనుకున్నాను. కాని, అది బస్సు హారన్ మ్రోత అని తర్వాత గుర్తుకొచ్చింది. రోజూ నేను గుంటూరు బస్‌డిపోలో వినే మోత ఇది!

అయితే ఇందాక నేను ఎక్కి కూర్చున్న బస్సు పోతూందన్న మాట!

నాకు చెప్పరానంత భయమేసింది. ఈ మాయదారి బస్సుతోపాటు నేనూపోతున్నానన్నమాట! నా గుండెలు పీచు పీచు మన్నాయి. 'ఎలారా దేముడా!' అని అనుకుంటూ మెల్లగా క్రిందకు గెంతాను. క్రొత్త కాపురానికెళ్ళుతున్న ఒక పడుచుజంట నెత్తిన పడ్డాను. పాపం, వాళ్ళిద్దరు చలికి ఒకరినొకరు పెనవేసుకుని కూర్చున్నారు. క్రొత్త కోడలు వులిక్కిపడి లేచి, భయం భయంగా, "ఇదేంటండి, బస్సులోకి పిచుక వచ్చింది?" అంది పాపం, అమాయకంగా.

నేనె బయటికెగిరిపోదామని అటూ ఇటూ ఎగిరి చూశాను. ఎటూ దారిపోలేదు. చలికి బస్సు అద్దాలన్ని మూసేశారు.

నాకప్పుడు నిజంగా భయం వేసింది. నా గుండెలు దడదడలాడాయి.

బయటికి పోవడానికి ఇంకెటయినా మార్గం వుందేమోనని మళ్ళీ ఆ బస్సులో ఇట్నుంచి అటూ, అట్నుంచి ఇటూ ఎగిరి చూశాను. ఎట్నుంచి ఎటెగిరినా బయటికి పోవటానికి ఎటూ దారిలేదు. నాకు వణుకు పుట్టుకొచ్చింది. ఏడ్పు ముంచుకొచ్చింది. పైకి ఏడ్చేశా కూడా.

నా ఈ గొడవుకు బస్సులో నిద్ర జోగుతున్న మిగతా ప్రయాణీకులంతా నిద్రలేచారు. నన్నుచూసి తలా ఒకమాట అన్నారు.

"హైదరాబాదు డీలక్సులో కూడ పిచుకలు ఏంటి స్వామి?"

"ఆర్టీసీవాళ్ళు బస్సులో పిచుకలను కూడ పెంచుతున్నట్లున్నారే!" అంతా గొల్లున నవ్వేరు.

అందరూ నవ్వేసరికి పాపం డ్రైవర్‌కు చిన్నతనమనిపించింది కాబోలు. దాన్ని కప్పిపుచ్చుకోవటానికి, "అద్దాలు తీస్తే సరి, అదే బయటికి పోతుంది!" అన్నాడు.

ఎవరో ఒక కిటికీ అద్దంకూడ తీశారు.

కళ్లు చికిలించుకుని బయటివైపు చూశాను. కటికచీకటి. విపరీతమైన చలిగాలి. మా

గుంటూరుకు ఎంతదూరం వచ్చేశామో! ఈ కటిక చీకట్లో, ఈ దారుణమైన చలిలో, ఎటూకాని ఈ అడివిదారిలో ఎక్కడికి పోను? మన వూరా, వుకమా? ఈ బస్సులో ఇలా పోవడమే మంచిదనిపించింది. అందుకే నేను కూర్చున్న చోట్నుంచి కదల్లేదు.

"బయటికి పోకుండా, పిచ్చిముండ ఎలా మునగదీసుకుని కూర్చుందో చూడండి! పాపం, ఈ చీకట్లో ఎక్కడికి పోతుంది?" అంది ఒక జాలిగుండె ముత్తయిదు.

"అబ్బ! చలిలో చస్తోన్నాం. కిటికీ మూసేయండి బాబూ?" అని ఎవరో అన్నారు.

కిటికీ అద్దం మూసేస్తూ, "మన్తోపాటు భాగ్యనగరం వస్తుందేమొ, రానీయండి!" అన్నాడొక గిరజాల జుట్టాయన.

బస్సులో ప్రయాణీకులంతా నవ్వేశారు.

నాకు మాత్రం ఏడ్పు ముంచుకొచ్చింది. ఏడుపుతోపాటు నామీద నాకు కోపం కూడ వచ్చింది. మాయదారి సచ్చినదాన్ని మాావపిచుక మీద అలగటమెందుకు. అలిగినదాన్ని ఆ గూట్లోనే ఒక మూల మునగదీసుకుని కూర్చోక ఈ బస్సెక్కడమెందుకు, ఎక్కిన దాన్ని బస్సు కదిలిపోతున్నది కూడ తెలియకుండా అంత ఆదమరచి నిద్రపోవటమెందుకు?

ఏదో శనిగ్రహం నా నెత్తిమీద ఎక్కి కూర్చుంది. అందుకే అలా జరిగింది. మనుషుల్లో అయినా, పిచుకల్లో అయినా ఈ మొగవాళ్ళబుద్ధి అంతా ఒకటే! వుత్త అనుమానరోగం. కాస్త పెళ్ళాం ఎర్రగా బుర్రగా వుంటే మరీన్నూ. నేను కాస్త అందంగా చస్తానేమో మాావకు నామీద అనుమానం. పరాయి మొగాళ్ళతో మాట్లాడితే తంటా; కాస్త నవ్వితే రంకు; రోజూ ఇదేపోరు. నీ అమ్మ అలాటిది, నీ అక్క ఇలాటిదీ అని నా పుట్టింటోళ్ళను చులకనగా మాట్లాడతాడు; నీ దగ్గర సంసారం చేసే లక్షణాలు లేవు అంటాడు.

నిన్నమాత్రం నిన్న, మా పుట్టింటి వయిపు బంధువొకడు వస్తే వాడితో నవ్వుతూ మాట్లాడుతుంటే అదొక పెద్ద నేరమయిపోయింది. ఆ వచ్చిన వాడికీ, నాకూ రంకూ! వాడికీ, నీకూ ఏదో వుంది. లేకపోతే మాటమాటికి ఎందుకొస్తాడు అని లేచేడు. మా అమ్మ ఒకతి- వుత్త పిచ్చి మాలోకం! ఆ బంధువు ఇటువయిపు వచ్చినప్పుడల్లా 'మా అమ్మాయిని చూచిరా; నీళ్ళు పోసుకుందేమో కనుక్కో!' అని కబుర్లు పంపుతుంది.

నిన్న మాావచేసిన రభసకు నాకు బలే బాధ అనిపించింది; ముళ్ళకంపలో చిక్కుకుపోయినట్ల నిపించింది. ఇన్నాళ్ళనుంచీ ఒకేగూటిలో కాపుర ముంటున్నాము. ఆ మాత్రం నా గుణం తెల్సుకోలేక పోయాడు కదా అని మనస్సు చివుక్కుమనిపించింది; ఏరికోరి మనస్సుపడి కన్నవాళ్ళందర్నీ వదిలేసి ఈయనగారి గూటికొచ్చేశా నానేగా ఇంత చులకనచేసి ఇన్నేసి మాటలంటున్నాడనిపించింది. ఆఫీసుల్లో కాపురం వుండే వాళ్ళతో మనకెందుకే అని అమ్మ ఆరోజే అంది. నేనే వినలేదు.

ఎందాకని వోర్చుకోను? నాకూ కడుపు మండింది. ఎదురు తిరిగి సమాధానం చెప్పాను. మాావ మరీ రెచ్చిపోయాడు; నోటికి వచ్చినట్లు అన్నాడు. నేను అలిగి ఏడుస్తూ ఈ బస్సులో ఒకమూల

పడుకున్నాను. ఎప్పుడు పట్టిందో నిద్ర పట్టింది. తీరా లేచిచూస్తే ఇలా బందిఖానాలో చిక్కుకున్నాను.... ఇలా ఆలోచిస్తోంటే మళ్ళీ కలత నిద్ర పట్టింది.

* * *

బస్సు ఆగింది. అంతా హడావుడిగా దిగుతున్నారు. వాళ్ళ మాటల్ను బట్టి బస్సు అడంగుకు చేరిందని, హైదరాబాదు వచ్చేసిందనీ తెల్సుకున్నాను.

నేనూ మెల్లగా బయటికి వచ్చాను. మాయదారి సచ్చినదాన్ని ఆ బస్సులో అలా కూర్చుండిపోయినా మళ్ళీ మా గుంటూరుకు చేరుకునేదాన్నేమో! శనిదేవత నెత్తిమీద కూర్చుంటే మన బుద్ధికూడ వక్రంగానే పోతుంది మరి?

బయట విపరీతమైన చలి. పుట్టి బుద్ధెరిగేక నేనలాటి చలి ఎరుగను. నేను తుర్రుమని ఎదురుగుండా వున్న రేకులషెడ్డులో అరుగు క్రిందకు చేరాను. అక్కడకూడా చలే. అయిసుగడ్డల మధ్య కూర్చున్నట్లుంది. అప్పుడు మా॰వ బలమైన రెక్కలమాటున వున్న వెచ్చదనం, ఆ సుఖమూ గుర్తుకొచ్చి ఏడ్పు ముంచుకొచ్చింది. నా బ్రతుకే ఏడ్పుకొట్టు బ్రతుకయిపోయింది!

ఎండవచ్చేవరకు అక్కడే మునగదీసుకుని కూర్చున్నాను.

చీకట్లు విచ్చిపోతుంటే మెల్లమెల్లగా ఎండ వచ్చింది; ఎండను చూడగానే నా ప్రాణం లేచి వచ్చింది. ఎదురుగా, క్రొత్త క్రొత్తగా వయస్సొస్తోన్న కన్నెపిల్లలాగా పచ్చని వేపచెట్టు కనిపించింది. దానిమీద కెగిరాను.

ఎండకు రెక్కలు అరపెట్టుకుంటుంటే ఎక్కడ్నుంచి తగలడ్డదో ఒక పిచుకుల గుంపు వచ్చింది. ఆ పిచుకులన్నీ నాచుట్టూ చేరాయి. అవన్నీ పొగరుబోతు పిచుకలు; వుత్త రౌడీ సచ్చినోళ్ళు.

అమాయకంగా, నున్ననున్నగా నవ నవలాడుతూ కనిపిస్తోన్నానేమో, వెధవ పోకిరీ కూతలన్నీ కూయటం మొదలుపెట్టాయి -

పల్లెటూరి గుంటరోయ్; బాగా బలిసి కస్సు కస్సు మంటూందిరోయ్- ఏ॰య్ పిల్లా. నాతో దోస్తుకట్టవా? నా గూటికి అస్తవా? - ఆడితో ఎందుకే, ఆడికి బీబీ వుంది; నాకెవరూ లేరూ, నాకు 'రఢీ' గా వుండు!- ఇలా నోటికొచ్చినట్లు కూయటం మొదలుపెట్టారు.

నాకయితే ఏడుపు ముంచుకొచ్చింది; మా॰వ గుర్తుకొచ్చాడు. మా గూడు గుర్తుకొచ్చింది. మా అమ్మ గుర్తుకు వచ్చింది. ఇన్నాళ్ళుగా నేను ప్రాణప్రదంగా చూసుకుంటున్న నా మానాన్ని వీళ్ళు మైలపర్చేటట్లు వున్నారు. మెత్తగా వుంటే లాభం లేదు.

మీకు అప్పలులేరా?, సెల్లెళ్ళులేరా? అని లేచాను. నా పలుకులువిని రెచ్చిపోయారే కాని, ఎవరూ తగ్గలేదు. ఎగిరిపోదామంటే చుట్టూ చుట్టుముట్టారు.

ఇంతలో నా అదృష్టం బాగుండి మరో ఆడపిచుక అక్కడికివచ్చి వాలింది. నా పరిస్థితి గ్రహించింది. వాళ్ళమీద, "వెధవల్లారా-రౌడీముండా కొడుకుల్లారా! ఆడపిల్ల బస్సుస్టాండుకు వొంటరిగా రావటం భయం - మీ రెక్కలు రాలిపోను - మీరు మాడిపోనూ-" అంటూ లేచింది. ఆమెను

చూడగానే, "అరేయ్, రౌడీ రంగమ్మ వచ్చిందిరో! పదండిరో" అంటూ ఆ పోకిరీ పిచుకలన్నీ తుర్రుమన్నాయి.

అప్పుడు రౌడీరంగమ్మ-ఛీ, అదేం పేరు, ఆ రౌడీసచ్చినోళ్ళు పిల్చారని నేనూ అదే పేరుతో పిలుస్తానా? 'అక్కా' అంటాను.... అప్పుడు, అక్క నామీద ఎంతో జాలి చూపించింది. తనింటికి తీసికెళ్ళింది. తను కాపురముంటున్న ఇంట్లో ఒక గదిలో చాల వడ్ల బస్తాలున్నాయి. క్రిందన్నీ వడ్లగింజలు పడివున్నాయి. ఒక్క గింజకూడ నా నోటికి పోలేదు. మావ గుర్తుకొచ్చాడు; ఏడ్పు ముంచుకొచ్చింది. ఆమె బలవంతంమీద కాస్త ఎంగిలి పడ్డాను.

తర్వాత ఆ యింటి పెరట్లోవున్న జాంచెట్టుమీద కూర్చున్నాము. అక్క మెల్లగా నా సంగతులన్నీ అడిగి తెల్సుకుంది, 'ఎక్కడ గుంటూరు? ఎక్కడ ఈ హైదరాబాదు?' అని జాలిపడింది. గుంటూరు పిచుక హైదరాబాదుకు ఇలా రావటం కేవలం విధివైపరీత్యమని అబ్బురపడింది. మావ గుణం తెల్సుకుని ఈ మొగ సచ్చినోళ్ళంతా ఇంతేనని మొగజాతినే ఈసడించుకుంది.

- నేనీ వూరుకొచ్చి మూడ్రోజులయింది; కాని నాకయితే మూడు యుగాలు అయినట్లుంది. ప్రతిక్షణం నా మనస్సు మావకోసం పరితపించి పోతూంది. గింజ కొరుకుతున్నా, కునుకు తీస్తోన్నా, ఒకచోట కూర్చున్నా నా మనస్సంతా నా మావమీదకే పోతూంది; మరో ధ్యాసలేదు.

నన్ను మా వూరు పంపించేయమని రోజూ అక్కను జాలిగా బ్రతిమాలుకుంటూనే వున్నాను. 'చూద్దాంలే, అలాగే పంపిస్తాలే!' అని రోజులు గడుపుకొస్తోంది.

ఇలావుండగా ఒకరోజు ఒక కుర్రపోతు పిచుకను వీడు మా తమ్ముడంటూ తీసుకొచ్చింది. నన్ను ప్రక్కకు పిలిచి - మా తమ్ముడు చాల మంచోడు. ఇంకా వాడికెక్కడా జత కుదరలేదు. నిన్ను చూచి లొట్టలు వేస్తోన్నాడు. నిన్ను నెత్తిమీద పెట్టుకుంటాడు. వాడితో జతకట్టు; వాడి గూట్లో కాపురం పెట్టు- అని మొదలు పెట్టింది.

ఆమె పలుకులు వినేసరికి నాకు వల్ల మానినంత దుఃఖం ముంచుకొచ్చింది. ఆమెను కౌగిలించుకుని, "అక్కా, నా మనస్సును నీవు గ్రహించింది ఇంతవరకేనా?" అని భోరున ఏడ్చాను.

"ఏంటే నీ మనస్సు పిచ్చి సన్యాసి; ఎవరైనా వింటే నవ్విపోయేరు. ఈ రోజుల్లో మాలావు మనుషులంటోళ్ళే మనస్సులు విరిగితే మారు మనువులు చేసుకుంటున్నారు. ఇక మనలాటి బక్క ప్రాణులు పిచుకులకు వచ్చిందా? మీవూరేమన్నా దగ్గరా, దాపా? ఎలా వెళ్ళుతావా పిచ్చి మొగమా?" అని సన్నసన్నగా కూకలేసింది.

ఇక ఈమెతో లాభంలేదు - నాదారి నేను చూచుకోవాలి; నా ప్రయత్నం నేను చేసుకోవాలని నిర్ణయించుకున్నాను. ఆ రోజే పొద్దుగూకుతుండగా ఎవరికీ చెప్పకుండా మెల్లగా జారుకున్నా. ఆర్టీసీ బస్సు స్టాండ్ కొచ్చా. నేను గుంటూరు బస్సు దిగిన చోటుకు ప్రక్కగా ఒక సారంగం లాంటి దాంట్లో ఎన్నో బస్సులు నిల్చివున్నాయి. ఎక్కడ చూసినా కరంటు దీపాలు పట్ట పగలులాగా వుంది. అటుకేసి రివ్వున ఎగిరెళ్ళాను.

లోపల మహాసందడి. హడావుడి. ఎక్కడ్నుంచో ఎవరో బిగ్గరగా ఏదో చెప్తున్నారు నాయనోయ్? ఇవేం బస్సులు. ఇదేం కతా! మా గుంటూరు బస్సుస్టాండ్ ఎక్కడా? రాక్షసి నోరులాగా ఇదెక్కడా? ఈ బస్సులన్నీ ఎక్కడకి పోతాయో? వీటిల్లో మా గుంటూరు బస్సు ఎక్కడుందో? ఒకదాంట్లో ఎక్కబోయి, ఇంకోదాంట్లో ఎక్కితే అదొక ఏడ్పు. మళ్ళీ క్రొత్తకథ మొదలవుతుంది. నాకు కంగారుపుట్టింది. కాలు ఆడటంలేదు. దిక్కు తోచటం లేదు.

సరిగ్గా ఆ సమయంలో అక్కా, ఆళ్ళ తమ్ముడు నన్ను వెతుక్కుంటూ వచ్చారు.

"ఎంత పన్జేశావే?" అని అక్క నన్ను చివాట్లు పెట్టింది.

"నీకంతగా పోవాలనుకుంటే అలాగే పోదువుగాన్లే! మా తమ్ముడు ఆ బస్సుల సమాచారం ఏదో కనుక్కుంటానన్నాడులే! ఇక గూటికి పద - రేపు రాత్రికే మీ వూరు పోదువుగాన్లే! ఈలోపల వాడు అన్నీ విచారిస్తాడు-" అని నన్ను గూటికి తీసుకుపోయింది.

పాపం, అతడు నిజంగానే నన్ను మావూరికి పంపించాలని అనేక ప్రయత్నాలు చేశాడు. ఎక్కడెక్కడో తిరిగాడు. ఎవర్నెరవర్నో వాకబు చేశాడు.

మూడోనాటి రాత్రికి గాని నా ప్రయాణం ముడిపడలేదు.

అక్కా, ఆళ్ళ తమ్ముడూ నన్ను గుంటూరు బస్సు ఎక్కించారు.

అక్క కన్నీళ్ళు పెట్టుకుంది. "వుండమంటే వుండకుండా పోతున్నావు కదా పిచ్చిముండా?" అంది. "మొగుడ్ని ఇంతగా ప్రేమించేదాన్ని నిన్నొక్కదాన్నే చూశా!"

వాళ్ళిద్దరూ నా పాలిటి దేవదూతల్లాగా కనిపించారు. రెండు చేతులెత్తి దణ్ణంపెట్టి నా కృతజ్ఞత చూపించుకోవటానికి దేముడు మాకు మనుషుల్లాగా చేతులివ్వలేదు. వాళ్ళ కాళ్ళ మీద నా తలపెట్టాను. వాళ్ళూ కరిగిపోయారు.

"క్షేమంగా చేరినట్లు తెలపటానికి, ఈ మనుషులకులాగా మనకు వుత్తరాలూ పత్తరాలూ లేవు గందా! ఎందో మన బతుకులు" అక్క కన్నీళ్ళు తుడుచుకుంది.

బస్సు కదిలింది

నన్ను వదల్లేక వదిలి బస్సులోంచి బయటికి తుర్రుమన్నారు. నేను చివరి సీటు క్రింద మునగదీసుకుని కూర్చున్నాను.

బస్సులో లైట్లు ఆరిపేశారు. నా కంటికి కునుకన్న మాట రాలేదు. నా మనస్సూ, నా ఆలోచనలన్నీ నా మావమీదే! మావకు ఆ ఒక్క 'అనుమాన రోగం' తప్ప, నన్నెంత ప్రేమగా చూసుకునేవాడు! నన్నొదిలి ఒక్క క్షణం కూడ వుండేవాడు కాడు. నేను కాసేపు కనిపించకపోతే గిలగిల్లాడిపోయేవాడు.

అలాటిది ఈ పదిహేనురోజుల్నించీ నేను కనిపించకపోయేపరికి, నా జాడ తెలియక యెంత ఇదయి వుంటాడో? ఏదైనా నాకు తీసుకొచ్చి పెట్టనిదే తను తినేవాడు కాదు; మరి ఇప్పుడు సరిగ్గా తింటున్నాడో లేదో!

- ఇలా, ఎన్నో ఆలోచనలు! ఆ ఆలోచనల్లోనే ఎప్పుడు పట్టిందో కలత నిదుర పట్టింది. ఆ కలత

నిదరలో కూడ మావ మీద ఎన్నో కలలు!

* * *

బస్సు గుంటూరు డిపోలో ఆగి ఆగగానే మా గూడువున్న ఆఫీసురూంలోకి ఎగిరెళ్ళాను.

మా గూట్లో నేనుండవల్సిన స్థానంలో మరో ఆడపిచుక వుంది. నా గుండెల్లో ముల్లు దిగబడినట్లయింది.

నన్ను చూచి మావ నానా మాటలు అన్నాడు.

"ఎవరితోనే లేచిపోయి, ఇన్నాళ్ళూ ఎక్కడెక్కడో తిరిగి మళ్ళీ ఏం మొగం పెట్టుకుని వచ్చావే తప్పుడు ముండా?'' అన్నాడు. ఆ నా సవతి కూడ అనేక మాటలు అంది. ఇద్దరూ నన్ను తరిమి కొట్టేశారు.

ఆ మధ్యాహ్నం మావ వంటరిగా వున్నప్పుడెళ్ళి ఏడ్చి జరిగినదంతా చెప్పాను. "నీ కట్టు కథలు నమ్మేటంత శుద్ధ వెధవను కాను'' అన్నాడు.

మళ్ళీ తనే అన్నాడుః "చిక్కి సగమైన నిన్ను చూస్తోంటేనే తెలుస్తోంది - నీవు ఎక్కడెక్కడ ఎన్ని చెడు తిరుగుళ్ళు తిరిగేవో?''

నేను విరక్తిగా నవ్వుకున్నాను.

ఇంకేదో చెప్పబోతుందటే, మావ, "నీకూ నాకూ పొసగదే! నీదారి నీవు చూచుకో!'' అని అన్నాడు పెడసరంగా.

"అంతేనా?'' అని అడిగేను.

"అంతే!'' అని రివ్వున ఎగిరి పోయాడు. మావ మనస్సు విరిగిపోయింది; నా మనస్సు చచ్చేపోయింది. విరక్తి నన్నావరించింది.

అవును. నా దారి నేను చూచుకోవాలి! నా దారి ఏంటో నాకు తెలుసు.

మా గూడు వున్న డి.యమ్. గారి ఆఫీసు గదిలోకి మెల్లగా వెళ్ళాను.

వెంటిలేటర్ తలుపుమీద కూర్చున్నాను. ఎదురుగావున్న వెంటిలేటర్‌లో మా గూడూ! నేనూ, నా మావా కలసికట్టుకున్న గూడు - ఇవ్వాళ, ఆ గూట్లో నాకు స్థానం లేదు. యీ గూట్లో మావ గుండెల మీద తలపెట్టుకుని, మావ బలమైన రెక్కల క్రింది వొరిగిపోయి ఎన్నో చలిరాత్రుళ్ళు, ఎన్నో వర్షపు రాత్రిళ్ళు, మరెన్నో చీకటి రాత్రుళ్ళు వెచ్చవెచ్చగా - పచ్చపచ్చగా గడిపేనో, ఎన్ని సరసాలు, ఎన్ని సరాగాలు, కితకితలు - కిచకిచలు...... ఈ గూట్లో ఇవ్వాళ నాకు స్థానంలేదు. ఈ గూటికోసం, మావ కోసం ఎన్ని పాట్లుపడి హైదరాబాదు నుండి తిర్గి వచ్చాను. మావ, 'నీదారి నీవు చూచుకో!' అన్నాడు. గూడు లేదు; మావా లేడూ!

ఆఫీసరుగారు తల వంచుకుని తదేకంగా ఫైళ్ళు చూచుకుంటున్నారు. గోడ గడియారం టిక్ టిక్ మంటూంది. పైన పంకా గిరగిరా తిరుగుతూంది - మృత్యుదేవత బొంగరాలు త్రిప్పుకుంటున్నట్లు; సృష్టి స్థితిలయాలు ఒక వెలుగై, ఆ వెలుగు నిరంతరం పరిభ్రమిస్తోన్నట్లు.

నా దారి నేను చూచుకోవాలి?!

ఈ పంకారెక్కల సుడిగుండంలోకే నాదారి..... నా రెక్కలూపుకుంటూ దాని వయిపుకు పరుగెత్తాను.

..............................

టప్పున క్రింద ఏదో పడ్డ శబ్దమయ్యేసరికి డియమ్ గారు వులిక్కిపడి తల ఎత్తి చూశారు. లుంగచుట్టుకుని క్రిందపడ్డ పిచ్చుక! బెల్ మ్రోగించారు.

ఫ్యూను లోపలికి వచ్చాడు. "దాన్ని తీసి అవతల పారేయ్!" అని మళ్ళీ ఫైళ్ళు చూచుకోసాడు.

(మనవి :

నేనొకసారి గుంటూరు నుండి హైదరాబాదుకు నైట్ డీలక్స్ బస్సులో ప్రయాణం చేస్తోంటే ఒక పిచుక ఆ బస్సులో ఇలా చాలాదూరం, బహుశా జగ్గయ్యపేట వరకు వచ్చింది. ఇది అరుదుగా జరిగే సంఘటన; విచిత్రంగా అనిపించింది. ఆరోజే ఈకథకు నా మనస్సులో మొలకపడింది. కాని, ఇది కథ ఎలా అవుతుంది అనుకొని వూరుకున్నాను, కాని, ఈమధ్య నా ఆఫీసురూంలో తిరుగుతున్న ఫ్యాన్ రెక్కలకు తగిలి ఒక పిచుక క్రిందపడి చనిపోయింది. మొదలు మాత్రమే తెలిసిన ఆనాటి కథకు తుది కూడా తెలిసింది....

'జ్యోతి సచిత్ర మాసపత్రిక *(1977)*

★